

**మిత్రులను** చూడ్డానికి నారాయణ కర్నూలు వచ్చాడు. అతని మిత్రులు హావుసిన సర్జన్ ప్రకాశమూ, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్స్ పిచ్చిరెడ్డీ, డివైఎస్పీ రామయ్యా చాల రోజులకు కలిసిన మిత్రుణ్ణి ఆనంద సముద్రంలో ముంచి తేల్చాలనుకున్నారు. వాళ్ళు ముగ్గురూ కౌంట్ దసేడ్ తరానికి కొత్త వారసులు. ఉద్యోగాల ధర్మమా అని డబ్బు చేతినిండుగా ఉన్న వాళ్ళు. చదువుకునే రోజుల్లో ఒట్టి ప్రవరాఖ్యుడుగా ఉన్న ప్రియ మిత్రుడు నారాయణను ఒక పట్టుబట్టి తమ దారికి మళ్ళించాలనుకున్నారు. తాము చవి చూస్తున్న స్వర్గ సౌఖ్యాలను గురించి వాజమ్మ నోట్లోనయినా నీ ళ్ళూరేట్లు నారాయణ ముందు వర్ణించారు. నారాయణ పాతివ్రత్యభంగానికి పిచ్చిరెడ్డి నాయకత్వం వహించాడు. పిచ్చిరెడ్డి తనలో మచ్చుకైనా లేని ఇతరుల్లోని నీతిని సహించలేడు.

నారాయణ కథలు రాసే విషయం పిచ్చిరెడ్డికి తెలును కాబట్టి రచయితలు పొందవలసిన రకరకాల అనుభవాలమీద పిచ్చిరెడ్డి నారాయణకు ఒక ఉపన్యాసాన్ని ఇచ్చాడు. ఉపన్యాస ధ్యేయమల్లా నారాయణను తమలాగా అనుభవజ్ఞుణ్ణి చేయటమే.

"చూడు నారాయణా! రచయితకు ఎన్నో రకాల అనుభవాలు కావాలి. జీవితానికి వెలిగా బతికితే అనుభవాలు రావు. రచయిత అనుభవాలను వెతకాలి. వెతక్కపోతే అనుభవాల్లో వైవిధ్యం ఉండదు. వైవిధ్యంలేని అనుభవాలు రచనలకు పనికిరావు. కొంతకాలం పనికివచ్చినా ఆ తర్వాత ఆ రచనలు కారప్పూస పొట్లాలకే పనికివస్తాయి. ఈ ఆడవాళ్ళు రాసే చాలా రచనలన్నీ అంతే. వేశ్యల జీవితాన్ని కథలో చిత్రించాలనుకో. వాళ్ళ పరిస్థితులను పరిశీలించకుండా, వాళ్ళ అంతరంగాలను శోధించకుండా కథలు రాయడం ఎట్లా కుదురుతుందీ? అదే మన రచయితలకూ వెస్ట్రన్ రైటంకూ తేడా. మరొకటి-ఆడదాని ముఖం ఇంతవరకూ చూడని నీవు ప్రేమ కథలు బరుకుతున్నావు. చూస్తే బరికే ఆ కథల్లో మరింత పరిశీలన ఉంటుంది కదా! ఉండాలంటే జీవితంలో తలక్కదులు కావాలి. ముప్పయిఏళ్ళు వచ్చినా నీకు స్త్రీ అనుభవం లేదు..."


నారాయణ ఇరుకునపడ్డాడు. సనాతన హిందూ రక్తం అతనిలో ప్రవహిస్తూనే ఉంది. ఇంతకాలం బ్రహ్మచర్యాన్ని నిలుపుకున్నందుకు అతనికి మనసులో ఏ మూలనో గర్వంగానే ఉంది. కానీ, అత నీమధ్య సెక్సు వాంఛను అణచుకోవటానికి ఎంతో అవస్థపడుతున్నాడు. వ్యక్తావ్యక్తంలోని కోరికలు కలల్లో తప్ప బయటికి రానీయకుండా ఏడుస్తుంటే వాటికి మిత్రులు మంట పెట్టారు. పిచ్చిరెడ్డి మంటను ఎగదోశాడు. ఈ మంటనుంచీ తప్పుకొమ్మని నారాయణ అంతరాత్మ ఘోషించింది. బలమైన కోరిక శరీరంమీద దిగ్విజయ యాత్ర సాగిస్తున్నప్పుడు శరీరానికి చెందిన అంతరాత్మ నోరుమూసుకోక తప్పదు. అంతరాత్మలు మైనం ముద్దలు.

మిత్రుల కవ్వింపులు. జీవితానుభవ సంపాదనా చాపల్యం. అతనిలోని రచయిత పడుతున్న తాపత్రయం. కలవరపెడుతున్న నెత్తురు.

నారాయణ గురమ్మ మేడకు వెళ్ళటానికి ఒప్పుకున్నాడు. నీడపట్లు తెలిసిన ఒక పక్షీంద్రుని నారాయణ వెంట పంపాడు రామయ్య. ఇలాంటి విషయాల్లో సాయపడే ప్రత్యక్ష అధికారాన్ని డివైఎస్పీ రామయ్య మిత్రునికి ఇంకా దఖలుపర్చలేదు.

ఒకవైపు ముందుకు సాగుతూనే దారిపొడవునా నారాయణ మధనపడిపోయాడు. కర్నూలు రాకున్నా బావుండేది. వీళ్ళున్నారే-ఈ ముగ్గురికీ, వీళ్ళకు జీవితంలో ఏ విలువలూ లేవు-తినటమూ, తాగటమూ, పక్కలోకి వెతుక్కోవటమూ తప్ప. వెధవది ఇట్లాంటి వాళ్ళకే మంచి ఉద్యోగాలు కూడా వస్తాయి. ముప్పయి దాటలేదు. అన్నివిధాలా చెడ్డారు. వీళ్ళమాట వింటే చెడిపోక తప్పదు. ఎవడి జీవితపు విలువలైనా పాడయిపోక తప్పవు. విశృంఖలత్వం వీళ్ళ దైవం. తను అందరిలాంటివాడు కాదు. తనొక నీతిగల కుటుంబంలో పుట్టాడు. తనకొక ప్రత్యేకత ఉంది. తను ఒక మేధావి. ఒక కాలేజీలో లెక్చరరు. విద్యార్థులకు శీలం తననుంచే అబ్బుతుంది. తను ఇలా వేటకెళ్ళడం-బయటి ఊరేకానీ, విద్యార్థులు పోటీగా ఆ సందుల్లో కనిపించారే అనుకో-ఎంత నామర్దా? తనకు కొన్ని నైతిక విలువ లున్నాయి. నైతిక బాధ్యతలున్నాయి. తాను రచయిత!

పిచ్చిరెడ్డి చెప్పింది నిజమేనేమో! రచయితకు జీవితానుభవాలు పుష్కలంగా ఉండాలి. చెడిపోకుండా జీవితానుభవాలను పొందవచ్చుకదా!




# కేతు విశ్వనాథ రెడ్డి

# బజారు

ఇప్పుడు చీకటి బ్రతుకుల విషాద గాథలను పరిశీలించే అవకాశం వచ్చింది. మంచి జాలి కథలు రాయవచ్చు. పాఠకులు కన్నీళ్ళు విడుస్తారు. ఎన్ని ప్రశంసలో! అంతకన్నా సాంఘిక ప్రయోజనం ఏముంది? ఒకవేళ ఇలాంటి జీవిత పరిశోధనలో నీతి తప్పితే! కళాకారుడు నీతికి అతీతుడంటారు. ఆస్కారు వైల్డునుంచీ బుచ్చిబాబుదాకా అదేమాట అంటారు. బుచ్చిబాబు 'కొత్తంతెన-పాత నీరూ' ఎంత బాగుంది! ఈ వెలుగు నీడల మధ్య ఆ ఎర్ర త్రికోణం తమాషాగా ఉంది. పెళ్ళిచేసుకుంటే బావుండు...గురమ్మ మేడ వచ్చిందనే హెచ్చరికతో నారాయణ ఆలోచనలు తెగిపోయాయి.

గురమ్మ మేడలో ఇద్దరే ఉన్నారు. ఆ ఇద్దరినీ నారాయణకు చూపింది. శరీరంలోని ప్రతి కదలికలోనూ సెక్సు వాసన కొడుతున్న తెల్లటి బొద్దు పిల్ల మీదనుంచే చూపు తప్పించి వెకిలితనంలేని ఏదో ఆకర్షణ ఉన్న రెండవ అమ్మాయిని నారాయణ చూశాడు. పొడవాటి సన్నటి ఒళ్ళూ. సోగ నలుపూ. కోల ముఖమూ, ముఖానికి అమరిన తిన్నని ముక్కూ. సన్నటి నడుమూ కళ్ళలో కదలాడుతున్న ఏవో నీడలూ. పెదాలలో దాచుకున్న మరేవో రహస్యాలూ ఆ క్షణాల్లో-ఆ అమ్మాయిలో చూశాడు నారాయణ. 'సిగ్గుతో. బెదురుతో. భయంతో అవ్యక్త సాహసంతో ఆ అమ్మాయిని ఎన్నుకున్నాడు. నారాయణ తేడు వచ్చిన బ్రోకరు గురమ్మతో మాట్లాడి యాభై రూపాయ లిచ్చి సెలవు తీసుకున్నాడు.

ఆ అమ్మాయితోపాటు నారాయణ ఒక గది చేరాడు. ఆ గదిని. గది వాతావరణాన్నీ యాంత్రికంగా మాటా పలుకూ లేకుండా తెల్ల దుప్పటి పరచిన పట్టిమంచం పరుపు మీద నిర్లిప్తంగా పడుకున్న ఆ అమ్మాయినీ చూచి నారాయణ హృదయం ద్రవించింది. ఆమె వైపు జాలిగా చూస్తూ నారాయణ అన్నాడు: "ఇట్లా కూర్చోండి. మరీ నే నంత నీచుణ్ణి కానులే. మీ పేరు?"

"సరళ" నారాయణను వింతగా చూస్తూ సమాధానించింది.

"బావుంది. ఏమన్నా చదువుకున్నారా?"

"పీయూసీ చదువుతూ మానేశాను-అమ్మానాన్నా పోయి."

"పాపం! ఏ ఊరు?"

"నెల్లూరు."

"మరి ఇంతదూరం కర్నూలుకు ఎందుకు వచ్చినట్లు?"

"గురమ్మ మా పిన్ని."

"ఈ నీచమైన వృత్తి ఎందుకు? ఏ సెకండరీ గ్రేడన్నా చదివి ఉండకూడదా?"

సరళ నీరసంగా నవ్వింది.

ఇంకే ప్రశ్నలు వేయాలో నారాయణకు తోచలేదు. సరళ ఆకర్షణ అతణ్ణి కాల్చుతోంది. ఆమె జాలి బ్రతుకు అతణ్ణి కోస్తోంది.ఆమె చెవి కమ్మల వైపు చూస్తూ అర్థరహితంగా అన్నాడు:

"నీ కమ్మలు చాలా బావున్నాయి."

సరళ నవ్వింది.

"ఆ ,బొద్దు పిల్ల ఎవరు?"

"మా పిన్ని కూతురు."

"మరీ వెకిలిగా ఉంది."

"అదంటేనే ఎంతోమంది ఇష్టపడతారు."

"నీ వెలువ తెలీక."

సరళ కళ్ళు పెద్దవి చేసుకుని నారాయణ మాటలు నమ్మలేనట్లు చూసింది.

"నే నొట్టి పనికిమాలినదాన్ని. సుఖం ఇవ్వటమూ చేతకాదు. పొందటమూ చేతకాదు. బలవంతంగా తీసుకోవాల్సిందే." క్షమాపణ కోరుతున్న ధోరణిలో అంది.

"నీ కింకా మనసు చావకుండా ఉండాలి. లేదా నాలా కొత్తేమో!"

సరళ నిట్టూర్చింది.

"నాతో కడపకు వస్తావా?"

"మీది కడపా? ఏంచేస్తా రక్కడ?"

"లెక్చరర్ని. కథలు రాస్తాను" నారాయణ గర్వంగా అన్నాఅడు.

సరళ ఆశ్చర్యంగా చూసింది.

"వస్తావా?" నారాయణ వివశుడై అన్నాడు.

"వెళ్ళినచోటల్లా కడపకు రమ్మని పిలుస్తారా?"

"లేదు. లేదు. నా కిదే మొదటి అనుభవం. నిన్ను చూశాక నా మన సేదో వశం తప్పింది. నువ్వీ చోట ఉండదగిన దానివి కాదు." వణుకుతున్న వేళ్ళతో చుబుకాన్ని ఎత్తి అన్నాడు.

"మరెక్కడ ఉండాలి?" కళ్ళలోకి సూటిగా చూసింది.

తన వెంట వస్తానని అంటుందేమోనని భయం కలిగింది. చూపులు తప్పించి చెవి కమ్మలతో ఆడుకుంటూ నారాయణ అన్నాడు.

"ఎందుకీ వృత్తిలో దిగావు?"

"మీలాంటివాళ్ళు ఎందుకు ఇలాంటి చోట్లకు వస్తారు?" సరళ గొంతు వణికింది.

"నిజమే. నిజమే. రాకూడదు. స్నేహితులు బలవంతం చేశారు." నారాయణ గొణిగాడు.

"మీ రెప్పుడూ ఇట్లాంటి చోట్లకు రాకండి. పెళ్ళయిందా?"

"కాలేదు."

సరళ నిట్టూర్చింది.

నారాయణలో కోరిక చచ్చిపోయింది. బయటికి నడిచిపోతున్న నారాయణను సరళ అయోమయంగా చూస్తూ ఉండిపోయింది.

సరళ మనసులని మెత్తటి గూడు క్షణం సేపు కదిలింది. నారాయణ మాటలు తలచుకొంది. అవి ఎండిపోతున్న మొగలి పొదమీద వాన చినుకుల్లా పనిచేశాయి. తనది అబద్ధాల బతుకు అనుకుంది. తన పేరు సరళ కాదు. సుబ్బులు. తను చదివింది వానాకాలం చదువు. తనది నెల్లూరు కాదు. తనకొక చోటు లేదు. గురమ్మ తన పిన్ని కాదు. తన కమ్మలు గిల్టువి. ఈ నిజం చెప్పి ఉంటే బాగుండేది అనుకుంది. చదువుకున్న వేశ్య అంటే గొప్ప. ఆ రకం గొప్పకోసం వచ్చేవాళ్ళకు అబద్ధాలు చెప్పవలసి వస్తోంది అనుకుంది. అతను మళ్ళీ వస్తే బావుంటుంది. అతనికి పెళ్ళి కాలేదట. అంత అదృష్టమా? వుండు కెలికి పోయాడు.

నారాయణ ప్రకాశం గదికి చేరుకున్నాడు. ప్రకాశం నైట్ డ్యూటీకి వెళ్ళాడని తెలిసింది. నారాయణ మనసులో ప్యాసా చిత్రం మెదిలింది. అతనిలో కలగాపులగపు భావాలు.

స్నేహితులదయితేనేం ఒక గంటకు ఏభై పోయినందుకు బాధ. అనుభవాన్ని జారవిడుచుకున్నందుకు దిగులు. సరళ తనను పనికిమాలిన నన్నాసికింద జమకట్టి ఉంటుందనే చింత. పీడ పట్టించిన మిత్రులపై కోపం. సరళపై జాలి. పిచ్చిరెడ్డిమీద కోపం.

నారాయణ ఆ రాత్రి సరిగ్గా నిద్రపోలేదు. అతనికి ఒక కల కూడా వచ్చింది.

కలలో అతనికీ సరళకూ పెళ్ళి జరుగుతోంది. పెళ్ళికి ప్రిన్సిపాలూ. విద్యార్థులూ పెద్దరికం. పత్రికల వాళ్ళు వచ్చారు. పోలీసులను వెంటబెట్టుకొని వచ్చిన గురమ్మనూ. పెళ్ళికి వచ్చిన పిచ్చిరెడ్డినీ. రామయ్యనూ చూసి సరళ కెవ్వన కేకవేసి పెళ్ళి పీటల మీద పడిపోయింది. మెడికల్ కాలేజీ ఆస్పత్రి...ఆస్పత్రి వాసన. సరళ ఒంటి నిండా జబ్బులేనని డాక్టర్ ప్రకాశం హవుస్ సర్జన్లతో చర్చిస్తున్నాడు...

ప్రకాశం నారాయణను నిద్రలేపాడు. రాత్రి తనకు వచ్చిన కలను గురించి ఆలోచిస్తూ. నారాయణ ఆ రోజంతా తెగులు తగిలిన కోడిలాగున్నాడు. ప్రకాశం నవ్వుకున్నాడు.

ఆ సాయంత్రం మిత్రులంతా సమావేశమయ్యారు. రాత్రి సంగతి చెప్పమని వేధించారు. ఎగతాళి చేశారు. నారాయణ బిక్కచచ్చిపోయాడు. ఏం జరగలేదంటూ. జరిగిందంతా చెప్పాడు.

పిచ్చిరెడ్డి నారాయణ భుజం మీద చెయ్యివేసి గురూపదేశం చేశాడు.

"నారాయణా! మీ అయ్యవార్ల తీరే ఇంత. ఏదో కొంపలంటుకుపోయినట్లు ప్రతిదానికీ నస పెడతారు. పైగా నువ్వో ఛోటా రచయితవు. రచయితలు పెట్టీ సెంటిమెంటల్ రబ్బిష్‌లో తప్ప బతకరు. నానా సాబ్‌స్టఫ్ చదువుతారు. రాస్తారు. ఏడ్చేదేదో వాళ్ళేడ్వక. తమతోపాటూ అందరూ ఏడ్వాలని ఏడుస్తారు. లేకపోతే ఈ జాలీ గీలీ నాన్సెన్సేమిటి? ఒకటి గుర్తుపెట్టుకో. ఈ జీవిత మొక బజారు. నీ కొనుగోలు శక్తినిబట్టి నీకు నచ్చిందేదో కొంటావు-తృప్తికోసం. అమ్మేవాడిదీ తప్పు కాదు. కొనేవాడిదీ తప్పు కాదు. ఆ బజారుదే తప్పు. కొంత కర్మ థియరీ ఒంటబట్టించుకోవాలి. నసుగుడు జబ్బులు పోతాయి. అసలు విషయం చెప్పమంటావా? నువ్వొక పిరికి గొడ్డువి. నంగిరి పింగిరి మాటల ముసుగులో నీ అసలు రంగు వేరు. నేను ఛాలెంజి చేస్తాను. నువ్వు రాత్రికి గురమ్మ స్వర్గంలోకి మళ్ళీ తప్పక పోతావు. రాత్రిలాగా రావు. కారణం నీ డెస్టినీ నీ చేతుల్లో లేదు."

పిచ్చిరెడ్డి మాటలకు నారాయణ పీక్కొని చచ్చాడు.

రెండో రోజు రాత్రి గురమ్మ మేడకు నారాయణ వెళ్ళకుండా ఉండలేకపోయాడు. మళ్ళీ తనకోసమే వచ్చిన నారాయణను చూసి సుబ్బులు ముఖం వికసించింది.

గదిలోకి వెళుతూనే నారాయణలో జాలిలేదు. ప్రేమలేదు-కోరిక తప్ప. వృత్తిలోకి ప్రవేశించింది మొదలు సుబ్బులు తొలిసారిగా నారాయణకు ఏమీ దాచుకోకుండా ఇచ్చింది. ప్రేమా తృప్తీ. ఆనందమూ మెరుస్తున్న కళ్ళతో చూస్తూ. చీర చెంగులు సరిచేసుకుంటున్న సుబ్బులును- నారాయణ చూడను కూడా చూడలేదు. మాటా పలుకూ లేకుండా గది దాటి పోతున్న నారాయణను చూచి సుబ్బులు నివ్వెరపోయింది. నారాయణలాంటి వాళ్ళ రచనలు చదవగలిగి ఉంటే ఇంకా ఏమయ్యేదో! బహుశః తన వృత్తే నయమనుకునే దేమో! లేకపోతే... ✱




**కదన** కుతూహల రాగాలావన
మొదలవుతున్నది మేలుకో!
వాగులు-వరదలు ఎదురవుతున్నా
వేగం మార్చక సాగిపో!

కాకుల మూ కలు గుసగుసలాడితే
కోకిల గానం ఆపదులే
జలధిని కెరటం ఎగసి పడిందని
చెలియలికట్టలు తొలగవులే

ముందు దారిలో ముళ్ళున్నాయని
ముదితల నడకలు ఆగవులే
తరువుకు చుట్టూ మిన్నాగులని
విరియక మొగలీ వాడదులే

ఎదురీతే యుగధర్మం నేస్తం!
విధికైనా తల వంచకు నేస్తం!
విజయం నిన్ను వరించేదాకా
విడువక జరిపెయ్ పోరాటం
వెనుకకు మరలక పయనించు!
విజయం తప్పక సాధించు!

--గాలి ప్రభావతి